


# కరపత్రం

SINCE 2014

మంగళవారం డిసెంబర్ 31 2024 | సంపుటి :0 | సంచిక : 80 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4



## మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఐటీశాఖ మంత్రి మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి బంజారాహిల్స్‌లోని సత్య నాదెళ్ల నివాసానికి చేరుకున్న సీఎం.. ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. స్కిల్ యూనివర్సిటీ గురించి ఆయనతో చర్చిస్తున్నట్లు సమాచారం.

తెలంగాణ రాష్ట్రం మొదటి నుంచీ మైక్రోసాఫ్ట్‌కు సానుకూలంగా ఉంది. హైదరాబాద్ మైక్రోసాఫ్ట్ సెంటర్‌లో సుమారు 4 వేల ఉద్యోగాలు వచ్చే విధంగా ఇటీవల ఒప్పందాలు జరిగాయి. దీనికి సంబంధించిన పురోగతిపైనా సత్యనాదెళ్లతో చర్చించే అవకాశముంది. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీలో ప్రధాన భాగస్వామి కావాలని ఆయన్ని కోరేందుకే ప్రధానంగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది.

## నెఫ్ట్, ఆర్టీజీఎస్ లావాదేవీలకు త్వరలో కొత్త సదుపాయం

**నెఫ్ట్, ఆర్టీజీఎస్ చెల్లింపుల సమయంలో సొమ్ములు అందుకునే వ్యక్తి పేరు కనిపించేలా కొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది.**




ఇకపై ఆయా చెల్లింపుల వ్యవస్థల ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు అవతలి వ్యక్తి పేరు కనిపించనుంది.

ఈ సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించింది.

వచ్చే ఏడాది ఏప్రిల్ 1కల్లా దీన్ని అందుబాటులోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఓ సర్క్యులర్ జారీ చేసింది.

బ్యాంకులన్నీ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌పీసీఐకి గడువును నిర్దేశించింది.

## దేశ ఆర్థిక వ్యవస్థకు మన్మోహన్ ఊపిరిలూదారు: శాసనసభలో సీఎం రేవంత్

- మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు.
- కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని చెప్పారు.
- ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవలందించారని పేర్కొన్నారు.
- 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయన ఊపిరిలూదారని సీఎం వివరించారు.
- ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం
- ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసింది: భట్టి విక్రమార్క



దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆయన సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. "మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పడింది. మన్మోహన్ సింగ్ ఎల్‌పీజీ విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపారు. 2004-14 మధ్య ప్రధానిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధిహామీ, ఆర్టీఐ, ఎన్‌హెచ్‌ఆర్‌ఎంను ప్రారంభించారు. ఆర్థిక స్థితిగతులు మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు సామాజిక విప్లవ కార్యక్రమమైన ఆధార్‌ను మన్మోహన్ ప్రారంభించారు. సరళీకృత ఆర్థిక విధానాలు తెచ్చి ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలి. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత. జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ప్రధాని సహా అనేక హోదాల్లో ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ఉపాధిహామీ పథకాన్ని అనంతపురం, మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం 2013లో భూసేకరణ చట్టం తెచ్చి నిరుపేదలకు న్యాయం జరిగేలా చేశారు. 2006లో అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసి ఆదివాసీలను ఆదుకున్నారు. ఐటీ రంగంలో శాసించగలుగుతున్నామంటే మన్మోహన్ విధానాలే కారణం. ఆయన తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ బిల్లులను 2 సభల్లో పాస్ చేయించిన సారథి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## సంధ్య థియేటర్ ఘటన.. అల్లు అర్జున్ అరెస్ట్‌పై స్పందించిన పవన్‌కల్యాణ్

**మంగళగిరిలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారని వ్యాఖ్యానించారు.**



"తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నాయకుడు. కిందిస్థాయి నుంచి ఎదిగారు. వైకాపా విధానాల తరహాలో అక్కడ వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్‌షోలకు అవకాశమిచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. ఆయన సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. 'సలార్', 'పుష్ప2'వంటి సినిమాలకు భారీ వసూళ్లు వచ్చాయి. 'పుష్ప2' సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం కూడా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే అవుతుంది. అల్లు అర్జున్ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. భద్రత గురించే వారు ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ కూడా అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. పోనీ, సీట్లో ఆయన కూర్చొన్నాక అయినా, చెప్పి తీసుకెళ్లాల్సింది"




## రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్: మంత్రి ఉత్తమ్

### "దేశ క్షేమం దృష్ట్యా మన్మోహన్ సింగ్ న్యూక్లియర్ ఒప్పందం కుదుర్చుకున్నారు.



దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ అనేక గొప్ప విధానాలు తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేసుకున్నారు. ఆయన సాధారణ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కొనియాడారు. మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఎంపిక చేశారని గుర్తు చేశారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ తెచ్చారని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. సామాన్య ప్రజలకు ఆయుధమైన 'ఆర్టీఐ', ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 'ఆధార్' తెచ్చారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన క్రియాశీల పాత్ర పోషించారని శ్రీధర్‌బాబు చెప్పారు.

## తెలంగాణలో ఐపీఎస్‌ల బదిలీ.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**తెలంగాణలో 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది..**

తెలంగాణలో 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉట్నూరు ఏఎస్పీగా కాజల్, ఆసిఫాబాద్ ఏఎస్పీగా ఎస్. చిత్తరంజన్ నియమితులయ్యారు.

### బదిలీ అయిన మిగతా అధికారులు వీరే..

- కామారెడ్డి ఏఎస్పీగా బి.చైతన్యరెడ్డి
- జనగామ ఏఎస్పీగా పి.చేతన్ నితిన్
- భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్
- కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా ఎన్.శుభం ప్రకాష్
- నిర్మల్ ఏఎస్పీగా రాజేష్ మీనా
- దేవరకొండ ఏఎస్పీగా పి.మౌనిక
- భువనగిరి ఏఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి

## న్యూఇయర్ వేడుకలు.. ఫ్లైఓవర్ల మూసివేత.. మెట్రో వేళల్లో మార్పులు

*న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు.*

*డిసెంబరు 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఐటీ కారిడార్‌లో ఫ్లైఓవర్లను మూసివేయనున్నట్లు పోలీసులు తెలిపారు.*

*ఓఆర్ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు.*

*సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.*

*సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.*

*ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతారని చెప్పారు*

### 31న రాత్రి ఉచిత ప్రయాణం

న్యూఇయర్ వేడుకల దృష్ట్యా డిసెంబరు 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ తెలిపింది. ప్రజలు మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

### మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు




నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయాణ వేళల్లో ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు మార్పులు చేసింది. డిసెంబరు 31న అర్ధరాత్రి 12.30 గంటల వరకు (జనవరి 1 ప్రారంభ వేళల్లో) మెట్రో రైలు సర్వీసులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

# ట్రంప్ రిటర్న్స్.. మోదీ మూడోసారి.. ప్రపంచ రాజకీయ గతిని మార్చిన ఏడాది!



ప్రపంచ జనాభాలో దాదాపు సగం (370 కోట్లమంది) జనాభా కలిగి ఉన్న సుమారు 72 దేశాలు ఈ ఏడాది జరిగిన ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నాయి.
భారత్ సహా అనేక దేశాల్లో ఆసక్తికర రాజకీయాలకు ఈ ఏడాది వేదికైంది. ప్రపంచ జనాభాలో దాదాపు సగం (370 కోట్లమంది) జనాభా కలిగి ఉన్న సుమారు 72 దేశాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నాయి. దక్షిణాఫ్రికా మొదలు భారత్, అమెరికా వంటి దేశాల్లో ప్రజాస్వామ్య పండగ వాతావరణం కనిపించింది. ఉక్రెయిన్ యుద్ధం ,పశ్చిమాసియాలో సంక్షోభాలు కొనసాగుతున్న సమయంలోనే ఈ ఎన్నికలు జరగ్గా.. గెలుపోటములతో ఆయా దేశాల్లో రాజకీయంగా కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.సుదీర్ఘ కాలంగా అధికారంలో ఉన్న అనేక మంది దేశాధినేతలకు 2024 ఏడాది ఓ సవాళ్ల సంవత్సరంగా మిగిలింది. అగ్రరాజ్యం అమెరికా మొదలు, బ్రిటన్, మెక్సికో తదితర దేశాల్లో నాయకత్వ మార్పిడికి ఓటర్లు జై కొట్టారు. మన దేశంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అధికార భాజపా.. మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

**బైడెన్‌కు బై బై.. పుతిన్ ఐదోసారి..**

అమెరికా ఓటర్లు.. బైడెన్ పాలనకు బై బై చెప్పారు. డెమోక్రాట్లకు విరామం ఇస్తూ రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ పాలనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇలా ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అమెరికన్లు ఎన్నుకోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. రష్యా ఎన్నికల్లో విజయం సాధించిన వ్లాదిమిర్ పుతిన్ ఐదోసారి అధికారాన్ని చేపట్టారు. ఎన్నికల ప్రక్రియపై అనేక ప్రశ్నలు వచ్చినప్పటికీ.. దాదాపు 80శాతం ఓటర్ల మద్దతుతో గెలిచినట్లు ప్రకటించారు.బ్రిటన్ రాజకీయాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. జులైలో జరిగిన ఎన్నికల్లో బ్రిటన్ ఓటర్లు కీలక తీర్పు వెలువరించారు. 14 ఏళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనకు తెరదించుతూ.. లేబర్ పార్టీకి అధికారం కట్టబెట్టడంతో కీర్ స్టార్మర్ పాలనాపగ్గాలు చేపట్టారు. మెక్సికోలో జరిగిన ఎన్నికల్లో క్లాడియా షీన్‌బామ్ విజయం సాధించారు. దీంతో ఆ దేశ తొలి మహిళా అధ్యక్షురాలిగా నిలిచారు.ఫ్రాన్స్‌లో ఈ ఏడాది జూన్‌లో మొదటిదశ, జులైలో రెండో దశలో ఎన్నికలు జరగ్గా.. అధ్యక్షుడు మెక్రాన్ కూటమికి చుక్కెదురయ్యింది. ప్రధాని మంత్రి మైఖేల్ బార్నియర్‌పై విశ్వాస తీర్మానం నెగ్గడంతో నూతన పీఎంగా ఫ్రాంకోయిస్ బెర్నియర్‌ను మెక్రాన్ నియమించారు. జపాన్‌ను సుదీర్ఘ కాలంగా పాలించిన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ ఓటమి చవిచూసింది. దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది.

**పొరుగుదేశాల్లో సంక్షోభాలు..**

భారత్ పొరుగుదేశాలు రాజకీయంగా కీలక పరిణామాలు ఎదుర్కొన్నాయి. పాకిస్థాన్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి జరిగిన ఎన్నికల్లో పీఎంఎల్ఎన్, పీపీపీతోపాటు మరికొన్ని పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐపై నిషేధం విధించినప్పటికీ.. ఆ పార్టీకి చెందిన అనేక మంది స్వతంత్రులుగా పోటీ చేశారు. వీరిలో దాదాపు 100 మంది విజయం సాధించి నేషనల్ అసెంబ్లీలో అడుగుపెట్టారు.రాజకీయ, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న శ్రీలంక.. ఈ ఏడాది నూతన అధ్యక్షుడిని ఎన్నుకొంది. సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో నేషనల్ పీపుల్స్ పవర్ కూటమి విజయం సాధించింది. దీంతో అనుర కుమార దిసనాయకే శ్రీలంక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు.

**భగ్గుమన్న బంగ్లా..**

ఈ ఏడాదిలో బంగ్లా రాజకీయాల్లో ఊహించని సంఘటనలు చోటుచేసుకున్నాయి. జనవరిలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన షేక్ హసీనా.. దేశ ప్రధానిగా ఐదోసారి బాధ్యతలు చేపట్టారు. కానీ, దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగసిన ఆందోళనలతో కొన్ని నెలల్లోనే ఆమె ప్రభుత్వం పడిపోయింది. ఈ తర్వాత చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో షేక్ హసీనా దేశాన్ని వీడి భారత్‌లో తలదాచుకుంది. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో అక్కడ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది.సిరియా కూడా రాజకీయం అస్థిరత్వాన్ని ఎదుర్కొంటోంది. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి స్వస్తి పలుకుతూ సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ కూడా దేశం నుంచి పారిపోయారు. ఇలా అనేక దేశాల రాజకీయాల్లో చోటుచేసుకున్న కీలక పరిణామాలను యావత్ ప్రపంచం గమనించింది.

# హెచ్1బీ వీసాలకు నేనెప్పుడూ అనుకూలమే: డొనాల్డ్ ట్రంప్



హెచ్1 బీ అంశం రిపబ్లికన్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీ నేతలు, ట్రంప్ మద్దతుదారుల్లో భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విషయంపై ట్రంప్ స్పందించారు.
వాషింగ్టన్: హెచ్1 బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ , భారతీయ- అమెరికన్ వివేక్ రామస్వామి ఈ చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇచ్చారు. దీనిపై అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగులు అమెరికాకు రావడానికి ఉపయోగపడే ప్రత్యేక వీసా ప్రోగ్రాంకు తాను మద్దతిస్తున్నానని తెలిపారు. తాను ఎల్లప్పుడూ హెచ్1 బీ లకు అనుకూలంగా ఉంటానని అన్నారు. అందుకే తమ దేశంలో ఆ వీసాలు ఉన్నాయని అన్నారు. అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీకి సంయుక్త సారథులుగా నియమితులైన మస్క్, వివేక్ రామస్వామి ఈ విషయంపై మాట్లాడారు. యూఎస్ తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నందున ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గలవారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బీ వీసా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.టాలెంట్ ఎక్కడున్నా దానిని అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతివ్వాలని కోరారు. మస్క్ కూడా హెచ్1బీ వీసా పైనే అమెరికాకు వలస వచ్చారు.కాగా ఈ విషయంపై పలువురు భిన్నమైన వాదనలు వినిపించారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన నిక్కీ హేలీ మాట్లాడుతూ తాను సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేసిన సమయంలో నిరుద్యోగిత రేటు 11 శాతం నుంచి 4 శాతానికి పడిపోయిందని అన్నారు. విదేశీ ఉద్యోగులను కాకుండా పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాం కాబట్టే అది సాధ్యమైందని..కొత్త ఉద్యోగాల కోసం ప్రజలకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు ఇప్పుడు విమానాలు, ఆటోమొబైల్స్ తయారీలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకానీ అమెరికన్లను తక్కువ అంచనా వేయొద్దని తన అభిప్రాయాన్ని వినిపించారు.ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలిగ్గా నియమించుకొనేందుకుఅమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం పలు నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతోపాటు సులువుగా ఎఫ్-1 విద్యార్థి వీసాలను హెచ్-1బీ వీసాలుగా మార్చుకొనే అవకాశం కల్పించింది. ఇది లక్షల మంది భారతీయ వృత్తి నిపుణులకు ప్రయోజనం కల్పించనుంది. ఈ వీసా నాన్ ఇమిగ్రెంట్ కేటగిరీలోకి వస్తుంది. టెక్నాలజీ కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను దీని సాయంతో నియమించుకొంటుంటాయి. ముఖ్యంగా భారత్, చైనా దేశాలు ఈ వీసా నుంచి చాలా లబ్ధి పొందాయి.

# పాకిస్థాన్‌పై తాలిబన్ ప్రతీకార దాడి



ఇరుగు పొరుగు దేశాలైన పాకిస్థాన్-అఫ్గానిస్థాన్‌ల మధ్య నెలకొన్న విభేదాలు ఘర్షణల స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల తన భూభాగంలో పాక్ సైనిక దాడికి ప్రతీకారంగా అఫ్గానిస్థాన్ ప్రభుత్వం కూడా స్పందించింది.
కాబూల్: ఇరుగు పొరుగు దేశాలైన పాకిస్థాన్-అఫ్గానిస్థాన్‌ల మధ్య నెలకొన్న విభేదాలు ఘర్షణల స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల తన భూభాగంలో పాక్ సైనిక దాడికి ప్రతీకారంగా అఫ్గానిస్థాన్ ప్రభుత్వం కూడా స్పందించింది. పాక్‌లోని కొన్ని శిక్షణ స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపింది. ఈ విషయాన్ని అఫ్గాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇనాయాతుల్లా క్వార్జామి 'ఎక్స్' వేదికగా శనివారం వెల్లడించారు. అఫ్గాన్ దాడుల్లో 19 మంది పాకిస్థాన్ సైనికులు మరణించారని తాలిబన్ అనుకూల మీడియా సంస్థ తన కథనంలో పేర్కొంది. ఇస్లామాబాద్ నుంచి దీనిపై స్పందన వెలువడలేదు. ఇటీవల తమ దేశంలో జరిగిన పలు ఉగ్రదాడులకు తాలిబన్లే కారణమని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా తాలిబన్ వర్గాలు గట్టిగా తోసిపుచ్చాయి.

# నెతన్యాహుకు ప్రోస్టేట్ సర్జరీ!

ప్రోస్టేట్ గ్రంథి సమస్యతో బాధపడుతున్న బెంజమిన్ నెతన్యాహు.. ఆదివారం శస్త్రచికిత్సకు సిద్ధమైనట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కొంతకాలంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ప్రోస్టేట్ గ్రంథి సమస్యతో బాధపడుతున్న ఆయన..ఆదివారం శస్త్రచికిత్స చేయించుకునేందుకు సిద్ధమైనట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఈ కారణంగా కొన్ని రోజులు ఆసుపత్రికే పరిమితం కావాల్సి ఉందని, అందుకే కేసు విచారణ వాయిదా వేయాలని కోరుతూ జెరూసలెం డిస్ట్రిక్ట్ కోర్టుకు నెతన్యాహు న్యాయవాది వెల్లడించారు. ఆయన ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. జనవరి 6 వరకు కేసు విచారణ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.


# కర్స్క్‌లో ఉక్రెయిన్ దళాల ఊచకోత

రష్యాలోని కర్స్క్ ప్రాంతాన్ని అనూహ్య రీతిలో స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ సైనికులు ఇప్పుడు అక్కడ ఊచకోతకు గురవుతున్నారు.



కీవ్: రష్యాలోని కర్స్క్ ప్రాంతాన్ని అనూహ్య రీతిలో స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ సైనికులు ఇప్పుడు అక్కడ ఊచకోతకు గురవుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత రష్యాలో కొంత భూభాగాన్ని ఆక్రమించిన మొట్టమొదటి దేశం తమదేనన్న ఉక్రెయిన్ల మురిపెం ఆవిరైపోయింది. రష్యన్ల భీకర దాడి ఉక్రెయిన్‌ను గుక్కతిప్పుకోనివ్వడం లేదు.ఉక్రెయిన్ సైనికులు రష్యన్లను ఎదుర్కోలేకపోతున్నారు. అలాగని వెనుదిరగలేకపోతున్నారు. పోరాటంలో గాయపడిన, మరణించిన తమవారిని తీసుకొని వెళ్లలేకపోతున్నారు. మొత్తం 50,000 మంది రష్యన్, ఉత్తర కొరియా సైనికులు ఉక్రెయిన్ దళాలపై విరుచుకుపడుతున్నారు. వేల సంఖ్యలో ఉక్రెయిన్ సైనికులు చనిపోతున్నారు. మరెందరో గాయపడ్డారు. ఆగస్టులో కర్స్క్‌లో తాను ఆక్రమించిన 984 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఇప్పుడు 40 శాతాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. తమ సైనికులు పోరాడటానికి నిరాకరిస్తున్నారనీ, ఉన్నతాధికారుల ఆజ్ఞలను సవాలు చేస్తున్నారని ఉక్రెయిన్ దళాల అధికారులు చెబుతున్నారు. 'మేము ఎక్కడున్నామో, రష్యన్లు ఎక్కడి నుంచి వచ్చిపడతారో కూడా అర్థం కావడం లేదు. మా అధీనంలో ఎంత భూమి ఉందో, రష్యన్ల చేతికి ఎంత భూభాగం వెళ్లిందో కూడా తెలియడం లేద'ని ఒక కమాండర్ వాపోయారు.

# విమాన ప్రమాదంపై అజెర్‌బైజాన్‌కు పుతిన్



విషాద ఘటనలో కజఖ్‌స్థాన్‌లో అజెర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కూలిపోయి 38 మంది చనిపోవడంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అజెర్‌బైజాన్ అధ్యక్షుడు అలియెవ్‌కి క్షమాపణలు చెప్పారు.
మాస్కో: విషాద ఘటనలో కజఖ్‌స్థాన్‌లో అజెర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కూలిపోయి 38 మంది చనిపోవడంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అజెర్‌బైజాన్ అధ్యక్షుడు అలియెవ్‌కి క్షమాపణలు చెప్పారు. ప్రమాదానికి రష్యాయే కారణమని వస్తున్న ఆరోపణల్ని మాత్రం అంగీకరించలేదు. తామే బాధ్యులమని ప్రకటించలేదు. ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకునేందుకు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు చేసిన ప్రయత్నంలో ఈ విమానం కూలిపోయి ఉంటుందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. రష్యా క్షిపణి తాకడం వల్లనే విమానం కూలిందంటూ ఉక్రెయిన్‌తో పాటు అజెర్‌బైజాన్ కూడా ఆరోపించింది. ఈ క్రమంలోనే పుతిన్ స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఈ చావుకు కారణమెవరు?

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతి నిధి
కోరుట్ల నియోజకవర్గం

**అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య.**
**ఇది చాలా బాధాకరమైన చావు.**
**ఎవరూ పట్టించుకోని చావు.**
**విని మరచిపోయే చావు.**



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో జరిగిన విషాద సంఘటన ఇది. అప్పుల బాధ తాళలేక మెట్‌పల్లికి చెందిన కంభంపాటి వినయ్ (35) ఉరి వేసుకొని చనిపోయాడు.ప్రైవెట్ ఉద్యోగం చేసుకొని కుటుంబాన్ని పోషించే వినయ్ చాలీ చాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే పరిస్థితి వుండేది. ఈ క్రమలో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.కొద్ది రోజుల క్రితం ఉద్యోగం పోవడంతో ఇతనికి ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.దీనివల్ల కుటుంబ నిర్వహణ భారమై, అప్పులు చేసి రోజులు వెళ్లదీసేవాడు.ఇలా అప్పులు పేరుకుపోయి ఆత్మాభిమానం గల ఇతడు ఆత్మహత్య చేసుకున్నాడు.కోరుట్లలోని తను కిరాయికి ఉన్న ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.ఇది విన్న వారు,అతని చావును చూసిన వారు గుండె బరువెక్కి భాధ పడడం తప్ప ఏం చెయ్యగలరు? ఇతను కనీసం ఏ సినిమా తొక్కిసలాటలో చనిపోయి ఉన్నా, అందరూ స్పందించేవారు.పెద్దవాళ్ళు వచ్చి పరామర్శించేవారు. ఉస్మానియా విద్యార్థి సంఘాల వాళ్ళు లొల్లి లొల్లి చేసేవారు. ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీలో మాట్లాడేవారు.సినిమావాళ్లు చనిపోయిన వ్యక్తి కుటుంబానికి లక్షల్లో కోట్లల్లో డబ్బులు ఇచ్చేవారు.కాని, ఇది మామూలు చావు, దిక్కులేని చావు.ఇది ఆత్మహత్య కాదు..అభిమానం చేసిన హత్య.ఇది అప్పుల చావు.నిరంతరం రోడ్డు ప్రమాదంలో చనిపోయే వారు, అప్పులతో ఆత్మహత్య చేసుకునే రైతులు, బుక్కెడు మెతుకులు దొరకక జరుగుతున్న ఆకలి చావులు, హాస్టళ్లలో విద్యార్థుల చావులు, మతోన్మాద చావులు, ప్రేమోన్మాద చావులు, రాజకీయ పార్టీ ర్యాలీల కొరకు వెళ్తున్న జనం ఆక్సిడెంట్ చావులు, దొంగ స్వాముల ఆశ్రమాల్లో రహస్య చావులు, ఫకీర్ల రేపుల చావులు,చర్చ్ పాస్టర్ల ప్రార్థన వల్ల వైద్యం అందక జరిగే చావులు.. ఇలా చావులు ఎన్నో రకాలు.కానీ,అన్ని చావుల్లోకెల్లా సినిమా తొక్కిసలాట చావు మాత్రమే ఘనమైనది.చనిపోయిన ఇతని భార్యా బిడ్డలను పరామర్శించడానికి ఎమ్మెల్యే రాడు, ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులు రారు.చోటా నాయకులు రారు. ఏ పార్టీ నాయకులు రారు.
ఈ వార్త ఇంతటితో సమాప్తం.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి...

- ఏ.ఐ.ఎస్.బి.నాయకులు..

**కరపత్రం బోధన్ బోధన్ డిసెంబర్ 30..**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బోధన్ పట్టణంలోని వాణి విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏ.ఐ.ఎస్.బి. నాయకులు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కు సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని శక్కర్ నగర్ లో గల వాణి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యం పాఠశాల నిర్వహిస్తుందని, శిథిలావస్థకు చేరుకున్న భవనంలో తరగతులు కొనసాగిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులకు భద్రత లేదని,ఫీజుల కోసం విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. మూత్రశాలలు,మరుగుదొడ్లు అసౌకర్యంగా ఉన్నాయని, నాణ్యమైన విద్య విద్యార్థులకు అందడం లేదని, అర్హత కలిగిన ఉపాధ్యాయులు పాఠశాలలో లేరని, ఇంటర్, డిగ్రీ చదివిన వారితో విద్య బోధన చేయిస్తున్నారన్నారు. అసౌకర్యాల మధ్య, అరకోర విద్యను అందిస్తున్న వాణి విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని ఏ.ఐ.ఎస్.బి. నాయకులు కోరారు.

## బోధన్ లో సినిమా షూటింగ్...

**కరపత్రం బోధన్ డిసెంబర్30..**
బోధన్ పట్టణంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఈ సందర్భంగా బోధన్ బార్ అసోసియేషన్ సభ్యులు ఆదినారాయణ బుల్లెట్ రెడ్డి సినిమాలో హీరోగా నటిస్తున్న సందర్భంగా పట్టణంలో షూటింగ్ జరుగుతున్న ప్రాంతానికి బోధన్ న్యాయవాదులు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి చిత్ర యూనిట్ కు అభినందనలు తెలిపారు. సినిమా దిగ్విజయంగా నడవాలని భవిష్యత్తులో సినిమా రంగంలో బోధన్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా న్యాయవాదులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డా.సమ్మయ్య, న్యాయవాది హనుమంతరావు లను ఆదినారాయణ శాలువాతో సత్కరించి, న్యాయవాద బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తర్ల శంకర్, బానోత్ రమేష్, ధర్మయ్య, రాఘవేందర్ లు పాల్గొన్నారు.

# నూతన సం.ర వేడుకల జాగ్రత్తలు సూచించిన కోరుట్ల సిఐ

ఆకుల రంజిత్ కరపత్రం ప్రతినిధి
కోరుట్ల నియోజకవర్గం



డిసెంబర్ 31 మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలనుకునే వారు తగు జాగ్రత్తలు పాటించాలని కోరుట్ల సిఐ సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు స్థానికి మీడియాకు వీడియో సందేశం పంపారు.శాంతభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.కోరుట్ల, మేడిపల్లి, మరియు కథలాపూర్ మండల ప్రజలకు ముఖ్యంగా యువకులు కొందరు 31 డిసెంబర్ రాత్రి మద్యం సేవించి రోడ్లపై విచ్చిలవిడిగా వాహనాలపై తిరుగుతున్నట్లు సమాచారం వస్తుంది. దీని వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలగడమే కాకుండా ఏద్కైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి ఎంత తీవ్ర నష్టమో ఆలోచించాలని ఆయన కోరారు. అందుకని ప్రజలు ఎవరికి ఇబ్బంది కలగని రీతిలో 31 డిసెంబర్ జరుపుకోవాలని కాని ఇతరులకు ఇబ్బంది కలిగించి వారు కూడా ఇబ్బంది పడే పరిస్థితులు తెచ్చుకోవద్దని ఆయన సర్కిల్ ప్రజలకు సూచించారు. అలాగే 31 డిసెంబర్ నాడు తాము కూడా డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహిస్తామని నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని ఆయన తెలిపారు.ఓ పక్క ప్రభుత్వం తాగమంటున్నది.. ఇంకో పక్క పోలీసులు తాగితే జాగ్రత్త అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నార్ను
ఈ వైనం తో జనం ఆనందంతో,అయోమయం తో ఎక్కువనే తాగేట్టునారు..

## బార్ధన్ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

- ఐఎన్ టియుసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతి...

**కరపత్రం నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 30 :**
నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్, రైస్ మిల్ లలో పనిచేస్తున్న గన్ని బ్యాగ్ రిపేర్ బార్దాన్ వర్కర్స్ ల సమస్యలు పరిష్కరించాలని ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఐ ఎన్ టి యుసి జిల్లా కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ భార్దాన్ కార్మికులకు యాజమాన్యాలు కనీస కూలీ రేట్లు, పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా లాంటి కనీస సౌకర్యాలు అమలు చేయడం లేదని అన్నారు. అనేక దుకాణాలలో బాల కార్మికులతో పనిచేయించుకోవడం వల్ల స్థానికంగా ఉన్న కార్మికులకు పని దొరకడం లేదని అన్నారు, బాలా కార్మికుల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పనిచేయిస్తున్న యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను, అదేవిధంగా నిజామాబాద్ నగరంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను బార్దార్ కార్మికులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భార్ధాన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దండే రాము, కార్యదర్శి షేక్ ఇమామ్, నాయకులు గంగాధర్, అబ్దుల్, సురేష్, రాజు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# తాగండి బాబూ తాగండి

## మత్తులో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించండి

కరుణాకర్ మల్లిగారి,
కరపత్రం ప్రతినిధి




ఎన్నికల పోలింగ్ సమయంలో, పండగలకు పబ్బాలకు, వినాయక నిమజ్జనం రోజు ప్రభుత్వం మందు అమ్మకాలపై ఆంక్షలు పెడుతుంది. కానీ కొత్త సంవత్సరం ముచ్చటే వేరు.మామూలు రోజుల్లో వైన్స్ షాప్ మూల మలుపుల్లో కాపుకాసి నోట్లో పుల్ల పెట్టి, ముక్కు పిండి డబ్బులు వసూలు చేసే పోలీసులు, ఈ ఒక్క రోజు కడుపు నిండా మందు తాగడానికి వెసులు బాటు ఇవ్వాలని మందు ప్రియులు ఆశిస్తున్నారు..పోలీసులు భయపెట్టినా సరే,ప్రభుత్వం పై భరోసాతో ఫుల్లుగా తాగాలని మందు బాబులు తీర్మానం చేసుకున్నారు.
తాగండి బాబూ తాగండి.
తాగి ఊగండి.
డిసెంబర్ 31 వస్తే చాలు మందుబాబులకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది.ఆ రోజు మద్యాన్ని మంచి నీళ్లలా తాగేస్తారు.గడిచిన ఏడాదిని గుర్తు చేసుకుంటూ పీకలదాకా తాగేస్తారు. పాత సంవత్సరం వెళ్లి పోతుందనే భాధలో,కొత్త సంవత్సరం వస్తుందనే ఆనందంలో తాగేస్తారు..ఈ ఏడాది డిసెంబర్ 31కి కూడా జనం రెడీ అయిపోయారని ప్రభుత్వం గ్రహించింది.ఈ నేపథ్యంలో మందుబాబులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది.ఈ నెల 31న వైన్ షాపులు. బార్లు, రెస్టారెంట్లు అదనపు గంటలు తెరిచి ఉంచనున్నారు.వైన్ షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు,బార్లు, రెస్టారెంట్లు, ఈవెంట్ల పర్మిషన్లను ఒంటి గంట వరకు పొడిగించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులిచ్చింది.ఇంకో పక్క ఈ వేడుకల్లో డ్రగ్స్ వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సర్కార్ ఆదేశించింది.ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈవెంట్లు, పార్టీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది.ఇక న్యూఇయర్ వేళ పోలీసులు మందు బాబులపై ఆంక్షలు విధించారు.హైదరాబాద్‌లోని 3 కమిషనరేట్ల పరిధిలో ఈ న్యూ ఇయర్ వేడుకలపై కఠిన ఆంక్షలు అమలు చేయనున్నారు.న్యూ ఇయర్ ఈవెంట్లు నిర్వహిస్తున్నవారు కచ్చితంగా అనుమతి ముందుగానే తీసుకోవాల్సి ఉంటుందన్నారు.ముఖ్యంగా పార్టీలు, పబ్బుల్లో మైనర్లకు ఎంట్రీ ఉండకూడదన్నారు.డిసెంబర్ 31వ తేదీ ఔట్‌డోర్ లో రాత్రి 10 దాటిన తర్వాత లౌడ్ స్పీకర్లు బంద్ చేయాలని పోలీసులు ఆదేశించారు.పార్టీలు నిర్వహించేటప్పుడు సౌండ్ 45 డెసిబుల్స్‌కు మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఇండోర్ మ్యూజికల్ ఈవెంట్స్ నిర్వహించేవారు ఈ నిబంధనలు కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలని సూచించారు.బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర డ్యాన్సులు కూడా నిషిద్ధమని, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే భారీగా జరిమానా విధిస్తామని చెప్పారు.రూ. 10 వేలు ఫైన్ విధించడంతోపాటు ఆరు నెలలపాటు జైలు శిక్ష కూడా ఉంటుందని హెచ్చరించారు. రోడ్లపై ఇతరులకు ఇబ్బందులు కలిగేలా విచ్చలవిడిగా తిరగటం, పిచ్చి వేషాలు వేయటం, అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం వంటివి చేస్తే కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు.ప్రశాంతమైన వాతావరణంలో ఇతరుల ప్రైవసీకి భంగం కలగకుండా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.తాగడానికి ప్రభుత్వం సమయం వెసులుబాటు ఇస్తుంటే..పోలీసులు ఆంక్షలు పెడుతున్నారని జనం హాస్యోక్తులు విసురుతున్నారు.
బాబూ తాగండి..రాష్ట్ర ఖజానా నింపండి.
మీరు తాగక పోతే ప్రభుత్వం చతికిల బడి పోతుంది.

తాగండి బాబూ...తాగండి.


కంగనా రనౌత్

# వివాదాల పరంపర

భారతీయ చిత్రసీమకు ఈ ఏడాది మంచి విజయాలు దక్కడమే కాదు వివాదాలు ఎదురయ్యాయి. ఫిబ్రవరిలో బాలీవుడ్ నటి పూనమ్ పాండే గర్భాశయ క్యాన్సర్‌తో మరణించనున్నట్లు ఓ వార్తను పంచుకుంది ఆమె బృందం. కానీ అదంతా పబ్లిసిటీ స్టంట్ అని తేలింది. దీంతో తర్వాత పూనమ్‌ని చాలామంది విమర్శించారు. అభిమాని రేణుకా స్వామిని హత్యచేశాడనే ఆరోపణల కారణంగా కన్నడ నటుడు దర్శన్ తూగుదీపను జూన్‌లో అరెస్టు చేశారు. ఇది బాగా వార్తల్లో నిలిచింది. ఈ ఏడాది ఆగస్టులో మలయాళ సినీ పరిశ్రమలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను బయటపెట్టింది జస్టిస్ హేమ కమిటీ . మహిళలు తమపై లేవనెత్తిన ఆరోపణలకుగానూ అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్ (అమ్మా) కమిటీలో ప్రెసిడెంట్, సీనియర్ నటుడు మోహన్‌లాల్ సహా 17మంది సభ్యులు రాజీనామా చేశారు. 2025 ఆస్కార్ కోసం మన దేశం నుంచి 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'ను కాదని 'లాపతా లేడీస్'ని ఎంపిక చేయడం పట్ల ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెప్టెంబరులో సోషల్ మీడియా నుంచి విమర్శలను ఎదుర్కొంది. బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన 'ఎమర్జెన్సీ' సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌ను జారీ చేయని కారణంగా ఈ వివాదం నెలకొంది. ఈ సినిమాలో ఓ వర్గానికి చెందిన ప్రజలను తక్కువ స్థాయిలో చిత్రీకరిస్తున్నారని ఓ వర్గం కోర్టులో పిటిషన్ వేసింది. దీంతో ఆమె వార్తల్లో నిలిచింది.



# అదే నాకు పెద్ద బహుమతి

## - అభిమానులతో యశ్



తనపై అభిమానులు చూపే ప్రేమ తీరును మార్చుకోవాలని నటుడు యశ్ విజ్ఞప్తి చేశారు. తన పుట్టినరోజుని పురస్కరించుకుని బహిరంగంగా వేడుకలు చేయొద్దని కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "కొత్త సంవత్సరం వస్తుందంటే మనం కొత్త నిర్ణయాలు తీసుకోవాలి. జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలి. ఎన్నో ఏళ్లుగా మీరంతా నాపై చూపిస్తున్న అభిమానం అసాధారణమైంది. ఆ క్రమంలో దురదృష్టవశాత్తూ కొన్ని సంఘటనలూ జరిగాయి. మన ప్రేమ భాషను మార్చుకోవాల్సిన సమయమిది. ముఖ్యంగా నా బర్త్‌డే సెలబ్రేషన్స్ విషయంలో.. మీ అభిమానాన్ని, ప్రేమను గ్రాండ్ ఈవెంట్స్‌తో చూపే ప్రయత్నం చేయొద్దు. మీరంతా సురక్షితంగా ఉండడం, అనుకున్న లక్ష్యాలు చేరుకోవడం, ఆనందంగా ఉండడమే నాకు పెద్ద బహుమతి. సినిమా షూటింగ్ కారణంగా నా పుట్టినరోజున సిటీలో ఉండను. కానీ, మీరు హృదయపూర్వకంగా చెప్పే శుభాకాంక్షలు నాకు చేరతాయి. నాలో స్ఫూర్తి నింపుతాయి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభిమానులందరికీ ముందుగానే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.జనవరి 8.. యశ్ పుట్టినరోజు. ఈ ఏడాది ఆయన బర్త్‌డే సందర్భంగా కటౌట్‌లు ఏర్పాటు చేస్తూ కరెంట్ షాక్‌కు గురై ముగ్గురు అభిమానులు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆ సమయంలో.. బాధిత కుటుంబాలను నటుడు పరామర్శించి.. వారి బాధ్యత తీసుకుంటున్నట్టు తెలిపారు. 'ప్రమాదాలు జరుగుతున్నాయి కాబట్టే నాకు పుట్టినరోజు వస్తుందంటేనే భయమేస్తోంది' అని మీడియా ముందు భావోద్వేగానికి గురయ్యారు.2022లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'కేజీయఫ్ 2' తర్వాత యశ్ నుంచి మరో సినిమా రాలేదు. ప్రస్తుతం 'టాక్సిక్' లో నటిస్తున్నారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. 1950-70ల మధ్య జరిగే డ్రగ్ మాఫియా కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. 2025 ఏప్రిల్ 10న విడుదల కానుంది.

# మోదీ ప్రశంసలు మాకెంతో ప్రత్యేకం

చిత్ర పరిశ్రమకు అక్కినేని నాగేశ్వరరావు చేసిన అమూల్యమైన సేవల్ని ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో కొనియాడిన సంగతి తెలిసిందే. తనదైన నటనా కౌశలంతో ఏఎన్నార్ తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారంటూ ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ నేపథ్యంలో ఏఎన్నార్ సేవల్ని మోదీ గుర్తుచేసుకోవడం పట్ల అక్కినేని కుటుంబం సామాజిక మాధ్యమాల వేదికగా కృతజ్ఞతలు తెలిపింది. "మహమ్మద్ రఫీ, తపన్ సిన్హా, రాజ్‌కపూర్ లాంటి దిగ్గజాలతో పాటు మా నాన్న ఏఎన్నార్‌ను ఆయన శత జయంతి సందర్భంగా మీరు గౌరవించడం ఆనందంగా ఉంది. భారతీయ సినిమాకి ఆయన దార్శనికత.. వారందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి" అంటూ మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ 'మన్ కీ బాత్' ఆడియో క్లిప్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు నాగార్జున "ఏఎన్నార్ కళా నైపుణ్యాన్ని, తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన సేవల్ని మీరు అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది మాకెంతో ప్రత్యేకం. మీ అద్భుతమైన ప్రశంసలకు హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ నాగచైతన్య , శోభిత దంపతులు పోస్ట్‌లు పెట్టారు.

# అలా చేస్తే జీవితాలు మారుతాయి..



దర్శకుడు పూరి జగన్నాథ్ 'పూరి మ్యూజింగ్స్' పేరుతో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు ఆసక్తికర అంశాలను పరిచయం చేసిన ఆయన తాజాగా సోషల్ మీడియా వినియోగంపై అభిప్రాయం వ్యక్తం చేశారు. దానికి దూరంగా ఉంటే జీవితాలు మారతాయని, విడాకులు తీసుకునే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. 'న్యూ రిజల్యూషన్' టాపిక్ గురించి ఆయన మాటల్లోనే..

"సోషల్ మీడియా చాలా పవర్‌ఫుల్ టూల్. దాని ప్రారంభ దశలో కమ్యూనికేషన్ పెరిగిందనుకున్నాం. కానీ, రానురానూ అది మన జీవితాల్లో దెయ్యంలా మారింది. దాని వల్ల ఇతరులతో పోల్చుకోవడం ఎక్కువైంది. ప్రతి దాన్ని ఫొటో తీసి చూపించడం ఎక్కువైంది. భర్తతో కాపురం చేయడం కంటే.. తమ భాగస్వామితో అన్యోన్యంగా ఉన్నట్టు ఫొటోలు పోస్టు చేయడంపై చాలామందికి ఆసక్తి పెరిగింది. కొత్త దుస్తులు ధరిస్తే ఓ ఫొటో తీయాలి. బెడ్ రూమ్‌లో ఓ ఫొటో, తింటునప్పుడు ఓ ఫొటో. డిజిటల్ అడిక్షన్ పెరిగిపోయింది. దీనికి తోడు ట్రోలర్స్. మన చుట్టూ జాబ్‌లేని వారు ఎంతోమంది ఉన్నారు. మీరు చూపించే ఫొటోలు వారికి నచ్చవు. అసూయ పడతారు. బికినీ వేసుకుని మాల్దీవుల్లో దిగిన ఫొటో మీరు పంచుకుంటే.. అది చూసిన ట్రోలర్స్ కామెంట్స్ చేస్తారు. కొందరు ప్రశ్నిస్తారు. మరికొందరు అసభ్యకరంగా మాట్లాడతారు. వాటన్నింటినీ చదువుతూ పనులు మానేసి మీరు ఏడుస్తూ పడుకుంటారు. ఎందుకంటే మీరు కూడా జాబ్‌లేని వారే! దాని వల్ల రోజూ మీరు కుంగిపోతూ బతుకుతారు"

"ఈ సోషల్ మీడియా పోస్టుల వల్ల ఎంతోమంది దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బంధాలు దెబ్బతింటున్నాయి. 10 విడాకుల్లో 3 సోషల్ మీడియా కారణంగా అవుతున్నాయని తాజాగా నిర్వహించిన ఓ సర్వే వెల్లడించింది. మీ ఇంట్లో జరిగే గొడవలకు సోషల్ మీడియానే కారణం. మీరు రిలేషన్‌షిప్‌లో ఉన్నా.. పెళ్లైనా దయచేసి దానికి దూరంగా ఉండండి. మీ భర్తే ప్రపంచం అనుకున్నప్పుడు మిగిలిన ప్రపంచం మీకెందుకు?మీ కుటుంబం బాగుండాలని కోరుకుంటే అవన్నీ ఎందుకు?ప్రతి క్షణం మీ జీవితంలో ఏం జరుగుతుందోనని లైవ్ టెలికాస్ట్ ఆపేయండి. మీరు ఆనందంగా ఉన్నా పోస్టు పెట్టొద్దు. బాధలో ఉన్నా పోస్టు పెట్టొద్దు. ముఖ్యంగా అమ్మాయిలు. వాళ్ల ఇన్‌స్టాగ్రామ్ చెక్ చేస్తే వాళ్లింట్లో ఏం జరుగుతుందో చెప్పేయొచ్చు. ఎవరితో ఏం గొడవ అవుతుందో ఊహించొచ్చు. అత్తతో గొడవ అయితే ఒక పోస్టు, భర్తతో గొడవ అయితే మరో పోస్టు. అది చూసి వెంటనే మరో మహిళ ఫోన్ చేస్తుంది. 'ఎందుకో తెలియదు అక్కా.. నువ్వు కలలోకి వచ్చావ్. ఇంట్లో అంతా ఓకేగా' అని మాట్లాడడం ప్రారంభిస్తుంది. మనం ఏడుస్తూ అన్నీ చెప్పేస్తాం. ఎందుకంటే మనకు బుద్ధి లేదు.. కుటుంబ విషయాలు చెప్పకూడదనే ఇంగితజ్ఞానం కూడా లేదు"

"ఒకటి గుర్తుపెట్టుకోండి.. మీరు ఏ పోస్టు పెట్టినా నెగెటివిటీని ఆకర్షిస్తున్నట్టే. మీ కుక్క ఫొటో పెడితే.. తర్వాత అది హాస్పిటల్‌లో చేరుతుంది. మీ భర్త ఫొటో పెడితే ఆయన అనారోగ్యంతో కిందపడిపోతాడు. డైనింగ్ టేబుల్ వద్ద దిగిన గ్రూప్ ఫొటో పెడితే ఫుడ్ పాయిజన్ అయి ఎవరో ఒకరు చనిపోతారు. ఇతరుల ఏడుపు తగిలి.. మిమ్మల్ని దరిద్రం చుట్టుకుంటుంది. అందుకే నెగెటివిటీని అట్రాక్ట్ చేయొద్దు. ప్రపంచంలోని 5 బిలియన్ మంది సోషల్ మీడియాలోనే ఏడుస్తున్నారు. అందులో మన దేశం అగ్ర స్థానంలో ఉంది. నా మాట విని.. ముఖ్యంగా పెళ్లైన వారంతా సోషల్ మీడియాకు దూరంగా ఉంటామని కొత్త సంవత్సరంలో తీర్మానించుకోండి. మీ ఆలోచనలు మారుతాయి, జీవితాలు మారుతాయి, విడాకులు తగ్గుతాయి. ఈ రోజుల్లో డిజిటల్ డిటాక్స్ ఎంతో అవసరం. కనీసం ఒక్క నెల అయినా ప్రయత్నించండి. మనశ్శాంతి అంటే ఏంటో చూస్తారు" అని పేర్కొన్నారు.